క్లుప్తంగా

నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామన్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే పంచాయతీ రాజ్ దినోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎంపీడీఓ హరికృష్ణ తెలిపారు.

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.గోవిందు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



సూర్యనమస్కారాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యనమస్కారాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్యనమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు ఆకొండి కృష్ణశర్మ, నాగాభట్ల కృష్ణ, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

గొరంపేటలో పారిశుధ్య డ్రైవ్



గొరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

డ్రైన్ల నిర్మాణ పనుల పరిశీలన



కాలువలపై సిమెంట్ మూతలు వేసే పనులను పరిశీలిస్తున్న నాయకులు

తుని రూరల్: ఎస్.అన్నవరం పరిధిలోని కొబ్బరితోట వీధిలో ఇటీవల నిర్మించిన మురుగు కాలువలపై సిమెంట్ పలకలతో మూతలను ఏర్పాటు చేసే పనులను వైస్ ఎంపీపీ పోడిశెట్టి సత్యనాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో పారిశ్రామికవాడల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఈ పనులు చేపట్టినట్టు వైస్ ఎంపీపీ తెలిపారు. రూ.ఐదు కోట్లతో నాలుగు సచివాలయాల పరిధిలో కాలువల నిర్మాణం, కాలువలపై పైకప్పులు వేసే పనులు జరుగుతున్నట్టు ఆయన వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంటా చక్రరావు, కుసనం దొరబాబు, వంగలపూడి కృష్ణారావు, వంగలపూడి వాసు, కీర్తి బాలకృష్ణ, వంగలపూడి జమీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్యోతుల నవీన్ పర్యటన

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, టీడీపీ నేత జ్యోతుల నవీన్ ఆదివారం పర్యటించారు. రౌతులపూడిలో మాజీ ఎంపీపీ భాస్కరబాబు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ములగపూడి సర్పంచ్ తమరాడ సత్యనారాయణ, సోమరౌతు చంద్రమౌళి తదితరులను కలిసి మద్దతు కోరారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనంలోకి జనసేన ప్రారంభం

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో ఆదివారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ వరుపుల తమ్మయ్యబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ పెంటకోట మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చివరిలో కలవరం

- వాతావరణ మార్పులతో ఆందోళన
- ఈదురు గాలులతో పంటకు నష్టం
- ఆదరాబాదరాగా పంట ఒబ్బిడి చేస్తున్న రైతులు



తిరుమాలి గ్రామంలో ఆరబెట్టిన ధాన్యం

ప్రత్తిపాడు: అల్పపీడన ప్రభావంతో వాతావరణం మారింది. మెట్టలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున, ఉదయం చిరుజల్లులు కురిశాయి. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఎండలు ఎక్కువగా ఉండడంతో పాటు రబీ దిగుబడులు ఆశాజనకం ఉంటాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేసింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికలతో ఆ ఆనందం ఆవిరైంది. పంట చేతికి వచ్చే దశలో వాతావరణంలో మార్పులు సంభవించడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆదరాబాదరాగా పంటలను ఒబ్బిడి చేసుకుంటున్నారు.

7,243 ఎకరాల్లో వరిసాగు

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 4,200 ఎకరాలు, ఏలేశ్వరం మండలంలో 2,100 ఎకరాలు, శంఖవరం మండలంలో 318 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 625 ఎకరాలు వెరసి 7,243 ఎకరాల్లో ఈ ఏడాది రైతులు రబీ సాగు చేపట్టారు. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1156, 1121, ప్రైవేటు వంగడాలైన లీడరు, సంపద, సాధన తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుతం అన్ని రకాల వంగడాల రబీ పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడితే పంట నేలకొరిగి రైతు నష్టాల బారిన పడతారు. దీనికి తోడు అల్ప పీడన ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తోంది. ఆదివారం ఉదయం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలల్లో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. ఈదురు గాలులకు పంట నేలకొరిగింది. పంట చివరి దశలో వర్షాలు కురిస్తే నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా పంట చేతికంది వచ్చే సమయంలో తుపాన్లు, భారీ వర్షాలు కురిసి రైతులు నష్టపోతున్నారు.

ముమ్మరంగా వరికోతలు

నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో రబీ వరికోతలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 25 శాతం కోతలు పూర్తయ్యాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు యంత్రాల సహాయంతో వరి కోతలను ముమ్మరం చేశారు.

ఏలేశ్వరం: తుపాన్ ప్రభావంతో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, లింగంపర్తి, సిరిపురం, పేరవరం తదితర గ్రామాల్లో వరికోతలు జరుగుతున్నాయి. రైతులు తమ పొలాల్లో నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టారు. ఓ మోస్తారుగా వర్షం పడడంతో కొన్నిచోట్ల ధాన్యం, వరి పనలు తడిసిపోయాయి. కాగా రైతులు ఆదరాబాదరాగా పంటను ఒబ్బిడి చేస్తున్నారు. ఉదయం వర్షం పడినా మధ్యాహ్నం నుంచి ఎండలు కాశాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రత్తిపాడు మండలం ఏలూరులో మెషీన్‌తో వరికోతలు

వర్షంతో ఉపశమనం

గోకవరం: గత వారం రోజులుగా వేసవి తాపంతో ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు ఆదివారం కాస్త సేదతీరారు. మండల వ్యాప్తంగా తెల్లవారుజామున చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడంతో వాతావరణం చల్లగా ఉంది. కాగా వాతావరణ మార్పులతో రబీ వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా నష్టపోతున్నాం



వరి పంట పక్వానికి వచ్చింది. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో వాతావరణంలో మార్పులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఏటా పంట చేతికి వచ్చే దశలో తుపానులు, వరదల కారణంగా నష్టాలు వస్తున్నాయి.

– పెట్ల కొండబాబు, రైతు, ఏలూరు, ప్రత్తిపాడు మండలం

ఆందోళన చెందవద్దు



వాతావరణ మార్పులపై కలవర పడవద్దు. వర్షం పడితే పంట పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి. 5 శాతం ఉప్పు ద్రావణం తడిసిన పనలపై చల్లాలి. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారు. వారి సూచనలు పాటించాలి.

– యింటి వీర గంగాధర్, మండల వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు

పోలీస్ ఖోఖో టోర్నీలో కానిస్టేబుల్ ప్రతిభ



ఖోఖో టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ అప్పారావును అభినందిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

ప్రత్తిపాడు: ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా పోలీస్ ఖోఖో టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొన్న ప్రత్తిపాడు కానిస్టేబుల్ జి.అప్పారావు తృతీయ స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ అప్పారావుకు రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రరెడ్డి నగదు రివార్డు, వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ పోలీసుల తరఫున రూ.లక్ష నగదు బహుమతి ప్రకటించారు. ఈబహుమతిని కానిస్టేబుల్ అప్పారావుకు జిల్లా ఎస్పీ అందజేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా ఖోఖో టోర్నమెంట్ విజేత అప్పారావును పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్, ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తదితరులు అభినందించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



వి.కొత్తూరు గురుకుల పాఠశాలలో పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మల కుమారి

తుని రూరల్: మండలంలో వి.కొత్తూరు, లోవకొత్తూరు గ్రామాల్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఐదు, ఇంటర్మీడియెట్ తరగతుల్లో (ఏపీబీఆర్ఏజీ సెట్) ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పది గంటలకు జరిగిన ఐదో తరగతి పరీక్షకు వి.కొత్తూరులో 198 మందికి 172 మంది, లోవకొత్తూరులో 195 మందికి 172 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు వి.కొత్తూరులో 197 మందికి 182 మంది, లోవకొత్తూరులో 65 మందికి 63 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ నిర్మల కుమారి, రాజు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో పోలీసు పికెట్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్న నేపథ్యంలో ఆదివారం పోలీసు పికెట్ నిర్వహించారు. స్థానిక సీఐ కె.కిషోర్‌బాబు ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం ఎస్సైలు పవన్‌కుమార్, సోబన్‌కుమార్, సతీష్‌బాబులతో కలిసి గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రహదారులపై పోలీసులు గస్తీ కాస్తున్నారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నట్లు సీఐ కిషోర్‌బాబు తెలిపారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్



కాకరాపల్లిలో జగన్ పాలనపై మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



భూపాలపట్నంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఆదివారం జోరుగా సాగింది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు అందే తీరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అతికించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, కోటనందూరులో సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెం, జగపతినగరం, భూపాలపట్నం గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. భూపాలపట్నంలో సచివాలయ మండల కన్వీనర్ ఆరుబోలు వాసు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు పలికిన వారి ఇంటి గోడలకు సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో బేరి బాల్జీ, గొంతెన రాంబాబు, చంటిబాబు పాల్గొన్నారు.

ముగిసిన నృసింహస్వామి తీర్థమహోత్సవాలు



నిజరూప దర్శనంలో వరాహలక్ష్మీనృసింహస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో కొలువైన సింహవల్లి రాజ్యలక్ష్మీ సమేత వరాహలక్ష్మీ నృసింహస్వామి తీర్థమహోత్సవాలు ముగిశాయి. ఈ నెల 19న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం స్వామివారి నిజరూప దర్శనంతో ముగిశాయి. చివరి రోజు కావడంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన చిన్నారులు 108 కలశాలతో అభిషేక జలాలు తీసుకువచ్చారు. అభిషేకం అనంతరం గంధోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో డప్పులు, బాణసంచా కాల్పుల నడుమ పైడితల్లి గ్రామోత్సవం కన్నులపండుగా జరిగింది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన విశేష సంఖ్యలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గోవిందు

కోటనందూరు: మండలంలోని అప్పలరాజుపేటలో ఆదివారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కేవీ మోహనరావుకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాలను కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమిల్లి గోవిందు ప్రారంభించారు. తునికి చెందిన మమత మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు 450 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రెడ్‌క్రాస్ తునిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బంగారు చెల్లయ్యనాయుడు, రొంగల రమణ, పాడిశెట్టి లక్ష్మణరావు, బంగారు గౌరీనాయుడు, బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులోని వెంకటనాగ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు

తొండంగి: హంకుంపేటలో గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. హంకుంపేట ట్రోఫీ ఫైటర్స్ జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. గ్రామానికి చెందిన గంటా తాతబ్బాయి జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహించారు. కాగా ఆదివారం హంకుంపేట టెర్రిఫిక్ హిట్టర్స్, హంకుంపేట ట్రోఫీ ఫైటర్స్ జట్ల మధ్య మధ్య ఫైనల్ హోరాహోరీగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన హంకుంపేట ట్రోఫీ ఫైటర్స్ 11.2 ఓవర్లలో 69 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. చేజింగ్‌లో హంకుంపేట టెర్రిఫిక్ హిట్టర్స్ జట్టు 12 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 68 పరుగులు మాత్రమే చేసింది. హంకుంపేట ట్రోఫీఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ.10 వేలు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.5 వేలు, ట్రోఫీని ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో గంటా లక్ష్మణ్, తిత్తి చిన్నబాబు, వంకా సత్యనారాయణ, గంటా గోపి, పేకేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాకపల్లిలో బీసీ నేతల సమావేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో ఆదివారం పార్టీలకు అతీతంగా బీసీ నేతలు సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీలు బీసీలకే సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ యువ నాయకురాలు అనూష యాదవ్ మాట్లాడుతూ బీసీలకు ప్రధాన పార్టీలు టికెట్లు ఇవ్వకపోతే స్వాతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. బీసీ అభ్యర్థికి ప్రతిఒక్కరూ అండగా నిలిచి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పైలా సుభాష్ చంద్రబోస్, కుండల సాయికుమార్, ఏపూరి శ్రీను, కోళ్ల రవి, రేఖా బుల్లిరాజు, ఎం.అప్పలరాజు, మడినే సూరరాజు, ఒమ్మి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండమ్మా బొట్టు పెడతా

- ఆలయాల్లో కట్టు, బొట్టు తప్పనిసరి
- పిఠాపురంలోని ప్రముఖ ఆలయాల్లో అమలు



భక్తుడికి తిరునామాలు దిద్దుతున్న ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు

పిఠాపురం: ఆలయాల్లో కట్టు, బొట్టు సంప్రదాయాలను ఆచరించడం ఇక తప్పనిసరి అంటున్నారు దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు. సనాతన ధర్మం నుంచి వచ్చిన ఆచారాలకు ప్రాణం పోయడానికి అధికారులు నడుం బిగించారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలైన హిందూ దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే అన్నవరం, చిన తిరుపతి వంటి ఆలయాల్లో వస్త్రధారణతో పాటు బొట్టు విషయంలో కఠిన నియమాలు అమలు చేస్తున్నారు. కాగా వీటిని అన్ని దేవాలయాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. పలు ఆలయాల్లో వస్త్ర ధారణ, బొట్టు విషయంలో నిర్దిష్ట నియమాలు అమలు చేస్తున్నారు. పిఠాపురంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించే భక్తులు ఇక నుంచి తిరునామాలు ధరించాల్సిందే. అభిషేకాలు, అర్చనల్లో పాల్గొనే భక్తులకు సాంప్రదాయ వస్త్రధారణను తప్పనిసరి చేస్తూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పిఠాపురం శ్రీపాద, శ్రీవల్లభ మహా సంస్థానంలో ఇప్పటికే తిరు నామాలు ధరించడం ప్రారంభించగా పాదగయ క్షేత్రంలోనూ ఈ నియమాన్ని పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో ఈఓ సౌజన్య భక్తులకు తిరు నామాలు ధరింపచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు ఈ సాంప్రదాయాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు నామాలు పెట్టేలా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. పాదగయ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో భక్తురాలికి తిరునామాలు దిద్దుతున్న ఈఓ సౌజన్య

చురుగ్గా విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు

- నెలాఖరు పూర్తి చేసేలా చర్యలు
- అధికారులు, కాంట్రాక్టర్‌కు ఈఓ ఆదేశాలు



విశ్రాంతి షెడ్డు స్తంభాలు నిలబెట్టి పైకప్పు వేయడానికి ఏర్పాటు చేసిన బీమ్స్



చెట్ల నీడన బస్సుల కోసం వేచి ఉన్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధికి పశ్చిమ రాజగోపురం మార్గం ద్వారా వచ్చే భక్తుల సౌకర్యార్థం పై జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్డు పనులు ఎట్టకేలకు వేగం పుంజుకున్నాయి. నాలుగు నెలలుగా ఈ పనులు నత్తనడకన జరుగుతున్న విషయం తెలిసిందే. శరవేగంగా జరగాల్సిన పనులు ఆలస్యం కావడంతో దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు పనులను వేగవంతం చేశారు.

రూ.18.56 లక్షలకు టెండరు ఖరారు

పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ పార్కింగ్ స్థలం వద్ద భక్తులు వాహనాలు దిగి సత్యదేవుని ఆలయానికి వస్తారు. ఇక్కడ ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో భక్తులు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నారు. ఇక్కడ షెల్టర్ నిర్మించాలని చాలా కాలంగా భక్తులు కోరుతుండడంతో దేవస్థానం ఎట్టకేలకు షెల్టర్ నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. రూ.23.73 లక్షలతో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవగా 21.87 శాతం తక్కువకు రూ.18.56 లక్షలకు దాఖలైన టెండర్‌ను గత నెల 30న దేవస్థానం ధర్మకర్తల మండలి ఆమోదించింది. వెంటనే పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఇప్పటివరకూ నత్తనడకన

భక్తుల సౌకర్యార్థం 30 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవు గల షెల్టర్ నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ నెలాఖరున పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిపివేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం మార్చి నెలాఖరుకు పనులు పూర్తి కావల్సి ఉండగా ప్రస్తుతం ఏప్రిల్ రెండో వారం వచ్చినా ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం షెడ్డు పైకప్పు నిర్మాణానికి ఐరన్ పిల్లర్స్ వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి.

పెరగనున్న భక్తుల రద్దీ

ప్రస్తుతం వైశాఖ మాసం కారణంగా దేవస్థానానికి భక్తుల రద్దీ పెరగనుంది. దీనికి తోడు 30వ తేదీ నుంచి సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మే ఒకటో తేదీన సత్యదేవుని దివ్యకల్యాణం జరుగనుంది. మే 11 నుంచి పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు రత్నగిరికి వస్తారు. అప్పటికి కూడా ఈ షెల్టర్ పనులు పూర్తికాకపోతే భక్తులకు ఇబ్బందులు తప్పవు. కాగా మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ డీఈ పి.గుర్రాజు తెలిపారు.

అన్నదానం

రౌతులపూడి: మండలంలోని బంగారయ్యపేటలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలోని కొట్టనాలమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు దొంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి చిట్టిబాబు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అవార్డులకు రెండు పంచాయతీలు ఎంపిక

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేట, గోర్స గ్రామాలు జిల్లాస్థాయి గ్రామ పంచాయతీ అవార్డులకు ఎంపికైనట్లు ఈఓపీఆర్డీ భాస్కరరావు ఆదివారం తెలిపారు. పేదరికం నిర్మూలన, ఆరోగ్యం, బాలహిత పంచాయతీ, నీటి సమృద్ధి, స్వచ్ఛత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, లింగ సమానత్వ తదితర తొమ్మిది అంశాలపై ప్రభుత్వం పంచాయతీలకు అవార్డు ప్రకటిస్తుంది. గోర్స పేదరికంలేని మెరుగైన జీవనోపాధి పంచాయతీ, రమణక్కపేటను బాలహిత అంశంలో అవార్డులకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి ఎస్వీ సత్యనారాయణ తెలిపారు.